క్లుప్తంగా

ఆలేడ్‌లో భక్తిశ్రద్ధలతో హోమం



ఆంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన హోమంలో పాల్గొన్న భక్తులు

దుద్యాల్: మండల పరిధిలోని ఆలేడ్ గ్రామంలో ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం భక్తిశ్రద్ధలతో హోమం నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం ఆంజనేయ స్వామికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం హోమం, అన్నదానం ఏర్పాటు చేశారు.

ఎల్ఈడీ లైట్లు అందజేత



కార్యదర్శి శ్రీకాంత్‌కు ఎల్ఈడి లైట్లు అందజేస్తున్న మాజీ ఉపసర్పంచ్ శ్రీహరి

నవాబుపేట: మండల పరిధిలోని చిట్టిగిద్ద గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌కు ఎల్ఈడీ లైట్లను మాజీ ఉపసర్పంచ్ ఎర్వ శ్రీహరి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి ఎలాంటి అవసరం ఉన్నా తన వంతు కృషి చేస్తానన్నారు. త్వరలో గ్రామానికి కావలసిన కనీస వసతులపై దృష్టిసారించి గ్రామ పంచాయతీకి ప్రణాళిక ప్రకారం సహాయసహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నందం, శ్రీనివాస్, సుధాకర్, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ప్రభుత్వం అండ

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వెంకటేశ్



రాపోల్ గ్రామంలో పంటలను పరిశీలిస్తున్న ఏఈఓ దివ్య, కాంగ్రెస్ నాయకులు

పరిగి: అధిక వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వెంకటేశ్ పేర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆయన వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆదివారం వ్యవసాయ విస్తరణ అధికారి దివ్య మండల పరిధిలోని రాపోల్ గ్రామంలో పంటలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ మొక్కజొన్న, కంది, పత్తి ఎక్కువ శాతం దెబ్బతిన్నాయన్నారు. నష్టపోయిన రైతులను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. రైతులు ఎవరు కూడా దిగులు చెందాల్సిన అవసరం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతు సంక్షేమానికి అహర్నిషలు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాకేశ్, రాజు, రాఘవేందర్, మాణిక్యం, కల్యాణ్, నరసింహా తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కృష్ణ దోలారోహణం



ఊరేగింపులో ఉత్సవమూర్తులు

కొడంగల్: శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను పురస్కరించుకొని ఆదివారం బాలగోకులం, డోలారోహణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కేశవ స్వామి ఆలయంలో ఐదేళ్ల లోపు చిన్నారులతో శ్రీ కృష్ణ వేషధారణ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలైన 8 మందికి 5 గ్రాముల చొప్పున వెండి బహుమతి ప్రదానం చేసినట్లు నిర్వాహకులు మురహరి వశిష్ఠ తెలిపారు. పట్టణంలోని పద్మావతి సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వేడుకలు నిర్వహించారు. శ్రీవారి ఉత్సవ మూర్తులను మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. చితారు పేరుమళ్ల దేవస్థానంలో ఉట్టికొట్టారు.

నేడు ఉపాధి హామీ ఆడిట్ ఓపెన్ ఫోరం

బొంరాస్‌పేట: మండలంలో గతంలో నిర్వహించిన సోషల్ ఆడిట్ నివేదికలను సోమవారం నిర్వహించనున్న బహిరంగ సభలో ఓపెన్ ఫోరమ్ నిర్వహించనున్నట్లు ఏపీఓ ఇలియాజ్ తెలిపారు. ఉదయం 10గంటలకు మండల కార్యాలయం వద్ద దీన్ని నిర్వహిస్తారని తెలిపారు.

భక్తిపరవశం.. అంబురామేశ్వరం



అంబురామేశ్వర ఆలయం

- తట్టెపల్లి అటవీప్రాంతంలో వెలసిన శివలింగం
- శ్రావణ మాసం సందర్భంగా జాతరకు ముస్తాబు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు
- ఐదు ఆకుల పుంటికూర ప్రత్యేకత



ఆలయంలో గర్భగుడి



ఆలయం వద్ద ఏర్పాటు చేసిన శివుడి భారీ విగ్రహం

తాండూరు రూరల్: కర్ణాటక–తెలంగాణ సరిహద్దులోని పెద్దేముల్ మండలం తట్టెపల్లి–పాషాపూర్ శివారులో వెలసిన శ్రీ అంబురామేశ్వర దేవాలయం జాతరకు ముస్తాబైంది. ప్రతీ సంవత్సరం శ్రావణమాసం చివరి సోమవారం నిర్వహించడం ఆనవాయితీ. ఈ వేడుకలకు తాండూరు, వికారాబాద్, కొడంగల్ ప్రాంతంతో పాటు కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. ఇందులో భాగంగా నిర్వహించనున్న ఉత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి గిరిజనులు కూడా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. దీనికి గిరిజనుల జాతర అని కూడా మరోపేరు ఉంది.

ఆలయ చరిత్ర

తట్టెపల్లి–పాషాపూర్ గ్రామాల మధ్య అటవీప్రాంతంలో త్రేతాయుగంలో శ్రీరాముడు సీతా, లక్ష్మణ్‌లతో కలిసి వనవాసం చేస్తారు. ఇందులో భాగంగా అంబురామేశ్వర అటవీప్రాంతంలో సేదతీరుతారు. ఇక్కడే శ్రీరాముడు శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించాడని కథలు..కథలుగా చెప్పుకుంటారు. అంతేకాక ఓ సమయంలో సీతాదేవికి దాహం వేస్తుందని చెప్పడంతో గుట్టలో బాణం వేయడంతో నీళ్లు వచ్చినట్లు అర్చకులు వివరించారు. ఇప్పటికీ నందివిగ్రహం నుంచి జలధార ప్రవహిస్తూనే ఉంటుంది. అంబురామేశ్వర ఆలయం నుంచి శ్రీశైలానికి సొరంగ మార్గం ఉన్నట్లు ఆనవాళ్లు కూడా ఉన్నాయని చెప్పుకుంటున్నారు. ఇక్కడ ఆంజనేయస్వామి విగ్రహం, పులిగుహా, నీటిగుండం, శివుడి భారీ విగ్రహాలు ఆకర్షణగా నిలుస్తున్నాయి.

నేడు జాతర

ఈ ప్రాంతంలో అహ్లాదరకమైన వాతావరణం ఉంటోంది. ఈ ఆలయం పరిసరప్రాంతంలో తట్టెపల్లితో పాటు చుట్టుపక్కల గిరిజన తండాలు కూడా ఉన్నాయి. శ్రావణమాసం చివరి సోమవారం జాతర నిర్వహించేందుకు ఆలయ కమిటీ చైర్మన్ ఉడువాల వెంకటేశంతో పాటు పాలకవర్గం సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెబుతున్నారు. తట్టెపల్లి గ్రామం నుంచి ఆదివారం రాత్రి స్వామివారి పల్లకీసేవ నిర్వహిస్తారు. మరుసటి రోజు శివలింగానికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆ తర్వాత సాయంత్రం పల్లకీసేవ అనంతరం తట్టెపల్లికి తిరిగి తీసుకెళ్లడంతో జాతర ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పెద్దేముల్ ఎస్ఐ వేణుకుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించనున్నారు. తాండూరు నుంచి జహీరాబాద్ రోడ్డు మార్గంలో తట్టెపల్లి గేటు నుంచి ఆలయం వరకు ఆటోలు, ప్రైవేట్ వాహనాలు అందుబాటులో ఉంటాయి. తాండూరు మండలం, చించోళి ప్రాంతం నుంచి వచ్చే భక్తులు జినుగుర్తి, అడికిచెర్ల మీదుగా రావొచ్చు. జాతర సందర్భంగా ఐదు ఆకుల పుంటికూర ప్రత్యేకత. ఈ పుంటికూర వంట చేసుకొని తినడం ద్వారా ఎలాంటి రోగాలు దరిచేరవని ప్రచారంలో ఉంది.

ముదిరాజ్‌లను బీసీ–ఏలోకి మార్చాలి



సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

ముదిరాజ్ సంఘం నాయకుల డిమాండ్

దౌల్తాబాద్: ముదిరాజ్‌లను బీసీ–డీ నుండి బీసీ ఏలోకి మార్చాలని కోరుతూ ఆదివారం నియోజకవర్గంలోని నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి సీఎం సానుకూలంగా స్పందించారన్నారు. ఈ విషయమై త్వరలో బీసీ కమిషన్‌తో చర్చించనున్నట్లు సీఎం చెప్పారని ముదిరాజ్ సంఘం నాయకులు పేర్కొన్నారు. ఎంతో కాలంగా బీసీ డీ గ్రూపు నుంచి బీసీ ఏలోకి మార్చాలని కోరుతూ ఉద్యమాలు, ఆందోళనలు చేస్తున్నామని వెంటనే సమస్య పరిష్కరించేందుకు కృషి చేయాలని సీఎంను కోరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యపాల్, నర్సప్ప, పకీరప్ప, వేణుగోపాల్, మహిపాల్, నర్సిములు పాల్గొన్నారు.

వర్షంలో తడవాల్సిందేనా?

- బస్‌షెల్టర్లు లేక ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు
- ఎండ, వానలోనూ గంటల తరబడి రోడ్లపైనే నిరీక్షణ
- పట్టించుకోని సంబంధిత అధికారులు



అమ్డాపూర్ చౌరస్తాలో వర్షంలోనే బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

మొయినాబాద్: బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులకు షెల్టర్లు కరువయ్యాయి. మున్సిపాలిటీ పరిధిలోని బస్‌స్టాపుల్లో ఎక్కడా షెల్టర్లు లేవు. దీంతో ఎండలో, వానలోనూ ప్రయాణికులు రోడ్లపైనే నిలబడి బస్సుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది.

నిత్యం వేలమంది రాకపోకలు

పట్టణ కేంద్రంగా విస్తరిస్తున్న మొయినాబాద్ ప్రాంతంలో ప్రయాణికులకు మాత్రం ఇబ్బందులు తప్పడంలేదు. మున్సిపాలిటీ పరిధిలోని గండిపేట చౌరస్తా, అజీజ్‌నగర్ చౌరస్తా, హిమాయత్‌నగర్ చౌరస్తా, అమ్డాపూర్ చౌరస్తాతో పాటు మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలో బస్‌స్టాపులు ఉన్నాయి. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి మొయినాబాద్ మీదుగా ఉండటంతో ఈ రోడ్డుపై ఆర్టీసీ బస్సులు చాలానే తిరుగుతాయి. మున్సిపాలిటీ పరిధిలో ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలలతో పాటు ఇతర విద్యాసంస్థలు ఉండటంతో నిత్యం వేలసంఖ్యలో విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. హైదరాబాద్ నగరంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి విద్యార్థులు మొయినాబాద్‌లోని విద్యాసంస్థలకు వస్తుంటారు. దీనికి తోడు ఈ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు, ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చేవారు వేల సంఖ్యలోనే ఉంటారు. అధిక శాతం మంది ఆర్టీసీ బస్సుల్లోనే వెళ్తారు. వారంతా బస్సుల కోసం నిరీక్షించేందుకు షెల్టర్లు లేవు. ఎండ ఉన్నా, వర్షం పడినా రోడ్లపైనే నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. మున్సిపల్ కేంద్రంలో సైతం బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రయాణికుల పాట్లు

ప్రతిరోజు వేల సంఖ్యలో ప్రయాణికులు బస్‌షెల్టర్లు లేక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. బస్‌స్టాపుల్లో బస్ షెల్టర్ల ఏర్పాటుపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి లేదని ప్రయాణికులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఆర్టీసీ అధికారులు, మున్సిపల్ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపాలని డిమాండ్ చేస్తున్నారు.

వైభవంగా మల్లన్న బోనాలు

కుల్కచర్ల: మండల పరిధిలోని ఇప్పాయిపల్లి గ్రామంలో మల్లన్న స్వామి బోనాలను గ్రామస్తులు వైభవోపేతంగా నిర్వహించారు. ఆదివారం గ్రామంలోని మహిళలు అందంగా బోనాలను అలంకరించి స్వామి వారికి నైవేద్యాలను సమర్పించారు. పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. రాజకీయాలకు అతీతంగా పండుగలు నిర్వహించుకోవడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఇప్పాయిపల్లిలో మల్లన్న స్వామికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

నేడు హిందూ ఉత్సవ సమితి సమావేశం

అనంతగిరి: రాబోయే వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని వికారాబాద్ హిందూ ఉత్సవ సమితి సమావేశం సోమ వారం నిర్వహిస్తున్నట్లు సమితి కన్వీనర్ కృష్ణ పంతులు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4గంటలకు స్థానిక రామ మందిరంలో ఉంటుందని పేర్కొన్నారు. కావున ఆయా వినాయక మంటపాల నిర్వాహకులు, హిందూ బంధువులు, ఆయా పార్టీల ముఖ్య నాయకులు, మాజీ కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులు సకాలంలో విచ్చేయాలని ఆయన కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

దోమ: మండల పరిధిలోని దిర్సంపల్లి, గుండాల సబ్‌స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాలకు విద్యుత్‌లో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ జి.వినయ్‌కాంత్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 33 కేవీ మరమ్మతుల కారణంగా గుండాల, దిర్సంపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గ్రహించి తమకు సహకరించాలని ఏఈ కోరారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే



దంపతులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే

కుల్కచర్ల: మండల కేంద్రంలో సాక్షి దినపత్రిక జర్నలిస్ట్‌గా పని చేస్తున్న విజయ్‌కుమార్ వివాహానికి పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఆదివారం మండల కేంద్రంలోని విజయచంద్రిక ఫంక్షన్ హాల్లో జరిగిన ఈ వివాహానికి ఆయన హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి అక్షింతలు చల్లారు. కలకాలం ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్, కాంగ్రెస్ డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ వ్యాఖ్యలు సరైనవి కావు

షాద్‌నగర్‌రూరల్: దేశం కోసం ప్రాణాలర్పించిన నాయకులను విస్మరించి కేవలం ఆర్ఎస్ఎస్ గురించి గొప్పగా చెప్పడం సరికాదని కాంగ్రెస్ సీనియర్ నేత ఎండీ.ఇబ్రహీం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని విమర్శించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహానుభావులు ప్రాణత్యాగాలు చేశారని, వారిని స్మరించుకోవడం విస్మరించి ఆర్ఎస్ఎస్ గురించి గొప్పగా చెప్పడం తగదని పేర్కొన్నారు. ప్రధాని.. ఎర్రకోటపై చేసిన ప్రసంగంలో భారతీయుల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడారని, ఇది సరికాదని హితవు పలికారు.

వీరభద్రేశ్వర ఆలయంలో లక్ష బిల్వార్చన



పత్రితో పూజలు చేస్తున్న మహిళలు

శాకాంబరీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు



ఆలయ కమిటీ సభ్యులకు వెండి ఖడ్గాన్ని అందజేసున్న భక్తుడు అభిషేక్

ధారూరు: మండల కేంద్రంలోని వీరభద్రేశ్వర ఆలయంలో ఆదివారం లక్ష బిల్వార్చన పూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్వర్యంలో పూజారులు చెన్న బసవయ్యస్వామి, కుమారస్వామి, గౌతమ్‌స్వామి, సంతుస్వామి భక్తులచే లక్ష బిల్వార్చన చేయించారు. ఉదయం 8 గంటల నుంచి కపిలేశ్వరస్వామికి రుద్రాభిషేకం, గణనాథుడు, కుమారస్వామి, నందీశ్వరుడు, వీరభద్రస్వామి, పార్వతీ మాతకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు శివలింగానికి మారేడు దళాలను పెట్టి పూజలు నిర్వహించారు. అనంతరం పార్వతీ, కపిలేశ్వరస్వామి కల్యాణం వైభవంగా చేట్టారు. సాయంత్రం పల్లకీలో వీరభద్రేశ్వరుడిని గ్రామంలోని వీధుల్లో ఊరేగించారు. వచ్చిన భక్తులందరికీ ఆలయ కమిటీ అన్నదానం ఏర్పాటు చేశారు.

శాకాంబరీ అవతారంలో..

పార్వతీమాతను వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ఆకు కూరలతో చెన్న బసవయ్యస్వామి, కుమారస్వామి అలంకరించారు. భక్తులకు అమ్మవారు శాకాంబరీ అవతారంలో దర్శనమిచ్చారు.

వెండి ఖడ్గం అందజేత

హైదరాబాద్ నగరానికి చెందిన చాట్ల అభిషేక్, నిఖిల దంపతులు పార్వతీమాతకు అలంకరించడానికి రూ. లక్ష విలువ చేసే కిలో బరువున్న వెండి ఖడ్గాన్ని ఆలయ కమిటీకి అందజేశారు.

గౌడల అభ్యున్నతికి కృషి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో యువజన సంఘం నాయకులు

షాద్‌నగర్: గౌడ కులస్తుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలకు హాజరుకావాలని కోరుతూ ఆయనను ఆదివారం యువజన సంఘం సభ్యులు కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వాయి పాపన్న బహుజన చక్రవర్తి అని, మొట్టమొదటి బహుజన వీరుడన్నారు. నాటి పాలకుల నిరంకుశ పాలనపై యుద్ధం చేసిన యోధుడన్నారు. సర్వాయి పాపన్న చేసిన కృషిని అందరూ గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గౌడలు ఆర్థికంగానే కాకుండా రాజకీయంగా ఎదిగే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రానున్న రోజుల్లో గౌడలకు మరిన్ని పథకాలను అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, నాయకులు భానుచందర్‌గౌడ్, అభిలాష్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, మధుసూధన్, ప్రవీణ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి



షాబాద్: మాట్లాడుతున్న సీఐ కాంతారెడ్డి



మొయినాబాద్: సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి

సీఐ కాంతారెడ్డి

షాబాద్: రానున్న వినాయక చవితి ఉత్సవాలను కులమతాలకతీతంగా శాంతి యుత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ కాంతారెడ్డి అన్నారు. ఆదివారం షాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక ఉత్సవ నిర్వాహకులు అన్ని వివరాలతో పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది గతంలో కంటే ఎక్కువ విగ్రహాలు ప్రతిష్ఠించే అవకాశం ఉందన్నారు. మండపాల వద్ద నిర్వహణ కమిటీ సభ్యులు అందుబాటులో ఉండాలని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీజేలకు ఎలాంటి అనుమతి లేదన్నారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా వ్యవహరించాలన్నారు. మండపాల వద్ద తగిన భద్రతను ఏర్పాటు చేసుకునేలా నిర్వాహకులు చర్యలు చేపట్టాలన్నారు. నిమజ్జన కార్యక్రమాలు శాంతియుతంగా చేసుకోవాలని కోరారు. సోషల్ మీడియాలో తమకు తెలియని విషయాలను ఇతరులకు పంపొద్దన్నారు. ఫ్రెండ్లీ పోలిసింగ్ మంచి వారికే వర్తిస్తుందని, చెడువారికి అసలు వర్తించదని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు సతీష్‌కుమార్, శంకర్‌రెడ్డి, ఏఎస్ఐ రామ్‌లాల్, పోలీస్ సిబ్బంది, యువజన సంఘాల నాయకులు ఉన్నారు.

అనుమతి తప్పనిసరి

మొయినాబాద్: వినాయక నవరాత్రి ఉత్సవాలను అన్ని గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయన నవరాత్రి ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలన్నారు. వినాయక మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని.. మండపాల వద్ద సీసీ కెమరాలు ఏర్పాటు చేయాలని.. డీజే సౌండ్ పెట్టొద్దని సూచించారు. ఉత్సవాల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఐలు వెంకన్న, సుభాష్, వివిధ గ్రామాల నిర్వాహకులు పాల్గొన్నారు.

నేడు జినుగుర్తిలో జాతర

తాండూరు రూరల్: తాండూరు మండలం జినుగుర్తి గ్రామ సమీపంలోని రామలింగేశ్వర స్వామి జాతరకు సర్వం సిద్ధం చేశారు. ఆలయ 42వ వార్షికోత్సవం సందర్భంగా శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కరమ్‌చందు, మోహన్‌దాస్, ఉత్తమ్‌చందు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 41 సంవత్సరాల క్రితం జినుగుర్తి గ్రామానికి చెందిన స్వర్గీయ పడగన్ రామప్ప పవిత్రపుణ్యక్షేత్రమైన వారణాసి నుంచి శివలింగం, కంచి నుంచి యంత్రాన్ని తెప్పించి జినుగుర్తిలోని రామలింగేశ్వర ఆలయంలో శివుడికి ప్రాణ:ప్రతిష్ఠ చేశారని పేర్కొన్నారు. నాటి నుంచి నేటి వరకు ప్రతి సంవత్సరం శ్రావణమాసం చివరి సోమవారం జాతర నిర్వహిస్తారని తెలిపారు. ఈ జాతరకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరై స్వామివారికి పూజలు చేయనున్నారని నిర్వాహకులు పేర్కొన్నారు.

సన్మానం



సన్మానిస్తున్న భీమ్‌రెడ్డి తదితరులు

షాద్‌నగర్‌రూరల్: యువత సేవాధృక్పదంతో ముందుకు సాగాలని రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ శాఖ చైర్మన్ భీమ్‌రెడ్డి అన్నారు. లయన్ మానుకోటబేరా సొసైటీ చైర్మన్‌గా డాక్టర్ రెడ్యానాయక్ ఎన్నికయ్యారు. ఆదివారం పట్టణంలోని భవాని కంటి ఆస్పత్రిలో చైర్మన్ భీమ్‌రెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయలక్ష్మి డాక్టర్ రెడ్యానాయక్‌ను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భీమ్‌రెడ్డి మాట్లాడుతూ.. సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడంలో యువత పాత్ర ఎంతో కీలకమన్నారు. సేవా భావాన్ని అలవర్చుకొని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. డాక్టర్ రెడ్యానాయక్ ప్రజలకు ఉచితంగా వైద్యసేవలను అందిస్తూ సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలతో ముందుకు సాగాలన్నారు. అనంతరం రెడ్యానాయక్ మాట్లాడుతూ.. ప్రజాసేవే పరమావధిగా ప్రజలకు ఉచిత వైద్యసేవలను అందిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో సొసైటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. సామాజికవేత్త డాక్టర్ వెంకన్నబాబు, కార్డియాలజిస్టు డాక్టర్ చందూలాల్‌రాథోడ్, బీజేపీ నేత నర్సింహారెడ్డి పాల్గొన్నారు.